## తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన



తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**లాలాపేట:** తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మాణికేశ్వర్‌నగర్‌లోని బెస్త అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ సునంద, ఎన్ఐఎన్ సైంటిస్టు భాస్కర్ తదితరులు పాల్గొని మాట్లాడారు. తల్లి పాల వలన బిడ్డకు, తల్లికి కలిగే ప్రయోజనాలను వివరించారు. స్థానిక నాయకులు ఆలకుంట హరి, వెంకటేష్,శ్రీనివాస్, ముత్తయ్య, వార్డుమెంబర్ లత, ఎన్ఐఎన్ టెక్నీషియన హృషికేష్ పాండా, మెడికల్ ఆఫీసర్ ప్రత్యూష పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యను పరిష్కరించాలి



డీఈకి వినతి పత్రం ఇస్తున్న స్థానికులు

**అమీర్‌పేట:** అమీర్‌పేట డివిజన్ బాపూనగర్‌లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు డివిజనల్ ఇంజినీర్ సుధీర్‌కుమార్‌ను కోరారు. మంగళవారం బాపూనగర్ రెసిడెన్సి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు గ్రీన్‌ల్యాండ్‌లోని డీఈ కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. అసోసియేషన్ అధ్యక్షులు హరిసింగ్ మాట్లాడుతూ కొన్ని చోట్ల తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు టి.మోహన్‌సింగ్,జగన్ సింగ్ పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన కార్పొరేటర్



**అడ్డగుట్ట:** పరిసరాల పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి అన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం తుకారాంగేట్ కొండారెడ్డి పార్కులో హార్టికల్చర్ అధికారులతో కలిసి ఆమె మొక్కలు నాటారు. అందరూ తమ ఇంటి పరిసరాల్లో విధిగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీను, మనోహర్, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ హేమ

**చిలకలగూడ:** సీజనల్ వ్యాధులపై మరింత అప్రమత్తంగా ఉండాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ కోరారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రెండవ రోజైన మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి బాపనబస్తీ, శ్రీనివాసనగర్, స్కందగిరి కాలనీ, నాగులూరివీధి మార్కండేయ నగర్, ఫ్రైడేమార్కెట్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఆయా ప్రాంత ప్రజలతో మాట్లాడి పలు అంశాలపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఇంచార్జి సంధ్యారాణి, యుసీడీ అధికారి ధనశ్రీ పాల్గొన్నారు.

## చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

**అడ్డగుట్ట:** చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్ హామీలు వెంటనే అమలు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఎస్. రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణిలు డిమాండ్ చేశారు. మంగళవారం మారేడుపల్లి మండల కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు, సారంగపాణిలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో చేవెళ్లలో నిర్వహించిన ఎస్సీ డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రధాన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. అనంతరం తహసీల్దార్ భీమయ్య గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు.

## వైభవంగా ఫలహార బండ్ల ఊరేగింపు



**బన్సీలాల్‌పేట్:** పద్మారావునగర్ సాయి దేవాలయం సమీపంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో హరిచారీ అధ్వర్యంలో అమ్మవారి బోనాల వేడుకలు, ఫలహారపు బండి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు జి. పవన్‌కుమార్ గౌడ్, టి. వెంకటరమణ, మహేందర్ గౌడ్, వెంకటేషన్ పాల్గొన్నారు.

## ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**లాలాపేట:** తెలంగాణలో ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ప్రచార కమిటీ కోఆర్డీనేటర్ శ్రీరాం శివకుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఏకలవ్య సంఘం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలోని ఎరుకల సామాజిక వర్గం విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో పూర్తిగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం వలన ఎరుకల ప్రజానీకం అభివృద్ధికి నోచుకోలేదన్నారు.

## హైదరాబాద్.. వేగంగా
# అభివృద్ధి చెందుతున్న నగరం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కమ్యూనిటీహాలును ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**బౌద్ధనగర్:** దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం హైదరాబాద్ అని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బౌద్ధనగర్ డివిజన్‌లోని పార్శిగుట్టలో ఎంపీ నిధులతో నిర్మించిన రెండస్తుల అశోక్ సేవా సంఘం కమ్యూనిటీ హాలు పారంభోత్సవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. బీజేపీ సికింద్రాబాద్ కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కమ్యూనిటీహాలును ప్రారంభించారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో మౌలిక వసతుల కల్పనకు అందరం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. స్థానికంగా ఆదాయం వస్తున్నప్పటికీ కేటాయింపుల్లో పూర్తిస్థాయిలో న్యాయం జరగడం లేదన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపి నగర అభివృద్ధికి నిధుల కేటాయింపులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. బస్తీల్లో రోడ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ వంటి అనేక మౌలిక వసతులను కల్పించాలని చెప్పారు. ఆగస్టు 15 తర్వాత నగర అభివృద్ధి కార్యక్రమాలపై 'దిశ' మానిటరింగ్ కమిటీ హైలెవల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్, ఎడ్యుకేషన్, మైనారిటీ వ్యవహారాలు, రైల్వేలు వంటి అంశాలపై చర్చించి, నత్తనడకన నడుస్తున్న పనులను వేగవంతం చేసేలా, చురుకుగా పనులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీసీ సుభాష్‌రావు, కార్పొరేటర్ కంది శైలజ పాల్గొన్నారు.

### పరిసరాల పరిశుభ్రతలో
## ప్రజల భాగస్వామ్యం అవసరం



మొక్కలు పంపిణీ చేస్తున్న జోనల్ కమిషనర్ రవికిరణ్ తదితరులు

**సనత్‌నగర్:** ఇంటి ఆవరణతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో జీహెచ్‌ఎంసీ సిబ్బందికి తోడుగా ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ పిలుపునిచ్చారు. 'స్వచ్ఛదనం–పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా బేగంపేట సర్కిల్ పరిధిలోని బేగంపేట ప్రకాష్‌నగర్‌లో వివిధ విభాగాల అధికారులతో ఆయన పర్యటించి మొక్కలు నాటారు. అలాగే చెత్త తరలింపును ప్రక్రియను పర్యవేక్షించారు. దోమల నివారణ, పారిశుద్ధ్య చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు చెత్త తరలింపు ప్రక్రియను చేపట్టి ఎక్కడా పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎంసీ సమ్మయ్య, డీఈ శ్రీనివాసరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు విశాల్ సూదం, షేక్‌గౌస్, అరుణ్, బాలు, శేఖర్, కృష్ణ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## 'కిమ్స్ సన్‌షైన్'లో ఆధునిక వైద్య సదుపాయాలు



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గురువారెడ్డి

**సనత్‌నగర్:** గతంలో పలు ఆరోగ్య రుగ్మతల కారణంగా శరీర భాగాలను సైతం తొలగించే పరిస్థితి ఉండేదని, ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాక ఆ పరిస్థితి ఇప్పుడు లేదని ప్రముఖ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, కిమ్స్ సన్‌షైన్ హాస్పటల్ చైర్మన్ డాక్టర్ ఏవీ గురువారెడ్డి అన్నారు. బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ హాస్పటల్‌లో వాస్కులర్ అండ్ ఎండోవాస్కులర్ సర్జరీ అండ్ డయాబెటిక్ ఫుట్‌కేర్ డిపార్ట్‌మెంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగికి ఖచ్చితమైన చికిత్సను అందించేందుకు దీనిని ప్రారంభించామన్నారు. డయాబెటిక్ ఫుట్ మేనేజ్‌మెంట్, వాస్కులర్ అండ్ ఎండో వేస్కులర్ సమస్యలు, డయాబెటిక్ ఫుట్ మేనేజ్‌మెంట్, రక్తనాళాలు గడ్డ కట్టడం, దీర్ఘకాలికంగా పాదాల్లో పుండ్లు మానకుండా ఉండడం వంటి సమస్యలకు గతంలో ఖచ్చితమైన చికిత్స లేకపోవడంతో కాలును పూర్తిగా తొలగించేవారని, ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన ఆధునిక చికిత్సలతో ఆయా భాగాలను తొలగించకుండానే చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హాస్పటల్ కన్సల్టెంట్ వాస్కులర్ అండ్ ఎండో వాస్కులర్ సర్జన్ డాక్టర్ నిషాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిరువ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన చిరువ్యాపారులు

**సనత్‌నగర్:** ట్రాఫిక్ నిబంధనల పేరుతో చిరువ్యాపారులను ఇబ్బందులకు గురిచేయవద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మోండా మార్కెట్, ఓల్డ్ గాంధీ హాస్పటల్, ఓల్డ్ జైల్‌ఖానా తదితర ప్రాంతాలకు చెందిన పలువురు చిరు వ్యాపారులు మంగళవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఆయనను కలిసి తమ సమస్యలను విన్నవించారు. చిన్న చిన్న వ్యాపారాలను చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నారంటూ ట్రాఫిక్ పోలీసులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తమను ఆదుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఆయన మోండా మార్కెట్ ట్రాఫిక్ సీఐకి ఫోన్ చేసి చిరువ్యాపారులను ఇబ్బందులకు గురిచేయవద్దని ఆదేశించారు.

### రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్
## మిడ్‌టౌన్ కమిటీ బాధ్యతల స్వీకరణ




**సనత్‌నగర్:** రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మిడ్‌టౌన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా అమర్‌దీప్, హాజీరాలు బాధ్యతలు స్వీకరించారు. బేగంపేటలోని కంట్రీక్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో పూర్వ అధ్యక్షురాలు నిధి ఆనంద్‌తో పాటు ఇతర సభ్యులు బాధ్యతలు అప్పగించారు. భవిష్యత్తులో తాము చేపట్టబోయే సేవా ప్రాజెక్టుల గురించి వారు వివరించారు. ఈ సందర్భంగా గిరిజాసంపత్, విజయలక్ష్మీ, శరత్ కోరట్కర్ తదితరులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధ్యక్ష, కార్యదర్శులకు అభినందనలు తెలియజేసి సన్మానించారు.

## ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం



ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని

**బన్సీలాల్‌పేట్:** తెలంగాణ సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ 90వ జయంతి సందర్భంగా మంగళవారం బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడలో తెలంగాణ ఉద్యమకారులు ఎస్. రాజేందర్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ సిద్ధాంతకర్తగా ఉద్యమస్ఫూర్తి ప్రధాతగా తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కె. హేమలత తదితరులు పాల్గొన్నారు.

## 10న సత్యాగ్రహ దీక్ష

**ఉస్మానియా యూనివర్సిటీ:** కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాంయాదవ్, ఓయూ జేఏసీ వ్యవస్థాపకులు మన అశోక్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఈ నెల 10న ఇందిరా పార్కు వద్ద చేపట్టనున్న సత్యాగ్రహ దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సోషల్ జస్టిస్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు చామకూర రాజు, మేకల కృష్ణ, లింగం, రాగం సతీష్, చందు తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ ఆర్ట్స్ కాలేజీ అధ్యక్ష కార్యాదర్శుల ఎన్నిక

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ ఆర్ట్స్ కాలేజీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా చిరంజీవి, రాజశేఖర్ నియమితులయ్యారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాలులో జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా విద్యవాసిని, జయవీర్, వేణు, జాయింట్ సెక్రెటరీలుగా రాజశేఖర్, సాయి, నితీష్, సాయికిరణ్ తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏబీవీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## గద్దర్‌కు ఘన నివాళి

**ఉస్మానియా యూనివర్సిటీ:** ప్రజా యుద్ధ నౌక గద్దర్ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని ఓయూ విద్యార్థులు నిర్వహించారు.మంగళవారం ఆర్ట్స్ కాలేజీ, ఇంజినీరింగ్ కాలేజీలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. మా అసోసియేషన్ పెద్దలు గద్దర్ సినీ అవార్డులను తక్షణం ప్రదానం చేయాలని, ఓయూలో గద్దర్ సాహిత్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ట్యాంక్‌బండ్ పై విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష, దళిత, బహుజన విద్యార్థి సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహంకాళి ఇన్‌స్పెక్టర్‌కు డీజీపీ అభినందనలు



**రాంగోపాల్‌పేట్:** ఓ హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు పడేలా కేసు దర్యాప్తు చేసిన మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురాంను డీజీపీ జితేందర్ అభినందించారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో ఆయన ప్రశంసా పత్రాన్ని అందించారు.

## బేగంపేట ఇన్‌స్పెక్టర్‌కు..



ఇన్‌స్పెక్టర్ రామయ్యకు అభినందన పత్రం అందజేస్తున్న డీజీపీ

**సనత్‌నగర్:** బేగంపేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రామయ్యకు అరుదైన గౌరవం దక్కింది. ఒక కేసు విషయంలో అద్భుతమైన ఇన్వెస్టిగేషన్ నైపుణ్యాన్ని ప్రదర్శించడమే కాకుండా బాధితులకు న్యాయం జరగడంలో విశేషంగా కృషి చేశారు. అంతేకాకుండా నిందితుడు తప్పించుకోకుండా అన్ని ఆధారాలను కోర్టుకు సమర్పించి అతనికి జీవిత ఖైదు పడడంలో కీలకంగా వ్యవహరించినందుకు గాను మంగళవారం ఆయన రాష్ట్ర డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. నందిగామ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును రామయ్య సమర్థవంతంగా విచారణ చేపట్టినందుకు ఈ గుర్తింపు లభించింది.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



ఆర్‌కే. ఫౌండేషన్‌లో కేక్ కట్ చేస్తున్న శ్రీగణేష్

**రసూల్‌పురా:** కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ జన్మదిన వేడుకలు రాయల్ లీ ప్యాలెస్ లో మంగళవారం ఘనంగా జరిగాయి. పలువురు ప్రముఖులు హాజరై ఆయన జన్మదిన శుభకాంక్షలు తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్, వాటర్‌వర్క్స్ సూపరిటెండెంట్ రాజ్ కుమార్, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, మార్కెట్ మాజీ చైర్మన్ ఆనంద్ బాబు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పుష్పగుచ్చాలు అందజేసి శ్రీగణేష్ చే కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అన్ని మతాలకు చెందిన మతపెద్దలు, ఆర్చకులు ప్రార్థనలు జరిపి ఆశీర్వచనం అందజేశారు.

### వృద్ధాశ్రమంలో..

కార్ఖాన జనక్‌పురిలోని ఆర్‌కే. ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఎమ్మెల్యే శ్రీ గణేష్ తన జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేశారు. వారికి భోజనం,పండ్లు పంపిణీ జేశారు. వృద్ధాశ్రమంలో ఉంటున్న వారికి నెలరోజులకు సరిపడా మందులు, ఐసీయూ మానిటర్, లైఫ్ సేవింగ్ సెక్షనింగ్ మిషన్, సర్జికల్ ఐటమ్స్ నిర్వాహకులు డాక్టర్ రామకృష్ణకు అందజేశారు. మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, బద్రీనాద్ యాదవ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

## 'ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయొద్దు'



**బౌద్ధనగర్:** స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లోని అంబనగర్‌లో మంగళవారం చెత్త తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కంది శైలజ మాట్లాడుతూ రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం వేయవద్దన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

## ఓయూ హెల్త్ సెంటర్‌లో వైద్యులను నియమించండి

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ క్యాంపస్ హెల్త్ సెంటర్‌లో వైద్యులను నియమించాలని విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులు డిమాండ్ చేశారు. గతంలో నైట్ డ్యూటీ డాక్టర్, లేడీస్ స్పెషలిస్టుతో పాటు 12 మంది వైద్యులు ఉండే వారని అందరు ఉద్యోగ విరమణ చేయడంతో ప్రస్తుతం పర్మనెంట్ డాక్టర్ ఒక్కరు కూడా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ గత నెల 31న ఉద్యోగ విరమణ చేయడంతో హెల్త్ సెంటర్ నిర్వహణ కష్టతరంగా మారిందన్నారు. కేవలం ఉద్యోగ విరమణ చేసి వైద్యులు, కాంట్రాక్టు డాక్టర్లతో రోగులకు సరైన వైద్యం, మందులు లభించడం లేదన్నారు. ఓయూ అధికారులు తక్షణం స్పందించి పర్మనెంట్ డాక్టర్లను నియమించాలన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

క్రైం కార్నర్..

**అడ్డగుట్ట:** అక్రమంగా తరలిస్తున్న 4 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన మేరకు.. దూద్‌బౌలికి చెందిన నీలి మల్లికార్జున్(62) అడ్డగుట్టలో రేషన్ షాపు నిర్వహిస్తున్నాడు. కుమారుడు నీలి సాయిలు(30)తో కలిసి మంగళవారం ఈస్ట్ మారేడుపల్లి నుంచి అక్రమంగా నాలుగు క్వింటళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పోలీసులు, సివిల్ సప్లై అధికారులు దాడిచేసి బియ్యం స్వాధీనం చేసుకొని ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.

## ప్రహరీని ఢీకొట్టిన స్కూలుబస్సు

చిన్నారులకు తప్పిన ప్రమాదం

**చిలకలగూడ:** విద్యార్థులతో వెల్తున్న స్కూలు బస్సు అదుపు తప్పి ఓ ఇంటి ప్రహరీని ఢీకొట్టింది. ఈ ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు, ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. నాచారంలోని దక్కన్ స్ప్రింగ్స్‌గ్లోబల్ స్కూలుకు చెందిన మినీబస్సు విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళ్లేందుకు మంగళవారం ఉదయం 8 గంటలకు పద్మారావునగర్‌కు చేరుకుంది. కొంతమంది విద్యార్థులను ఎక్కించుకుని బలరామ్‌కాంపౌండ్ వైపు వస్తుండగా అదుపు తప్పి ఓ ఇంటి ప్రహరీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రహరీగోడ కుప్పకూలగా, బస్సు అద్దాలు ధ్వంసం అయ్యాయి. విద్యార్థులకు ఎటువంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని చిన్నారి విద్యార్థులను మరో బస్సులో పాఠశాలకు తరలించారు.

## వ్యక్తి అదృశ్యం

**రసూల్‌పురా:** బోయిన్‌పల్లి మార్కెట్‌కు వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. తిరుమలగిరి ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపిన మేరకు.. చత్తీస్‌ఘడ్ పాటికాయల దుర్గ్ జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ వేద్ ప్రకాష్ సాహు తన స్నేహితుడు కులేశ్వర్ పటేల్ (30)తో గత నెల 31న లారీలో కూరగాయలు తీసుకుని బోయిన్‌పల్లి మార్కెట్‌కు ఉదయం వచ్చాడు. అదే రోజు రాత్రి 7 గంటల సమయంలో కులేశ్వర్ పటేల్ వంట చేసేందుకు మంచినీళ్ళు తెచ్చేందుకు వెళ్ళి తిరిగి రాలేదు. దీంతో స్నేహితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

**చిలకలగూడ:** గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆరవ నంబరు ప్లాట్‌ఫారం 8వ పిల్లర్ వద్ద ఓ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

## ద్విచక్ర వాహన దొంగ అరెస్ట్

**రసూల్‌పురా:** గంజాయి. మత్తు పదార్థాలకు అలవాటు పడ్డ ఓ యువకుడు హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్‌లోని పలు పోలీస్‌స్టేషన్ల పరిదిలోని ద్విచక్ర వాహనాలను తస్కరించాడు. చోరీ చేసిన ద్విచక్రవాహనంపై వెళుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. కార్ఖాన ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన మేరకు బోడబండ రైల్వేస్టేషన్ సమీపంలో ఉండే సయ్యద్ సోహాల్ (29) హైటెక్‌సిటీ మెడికోవర్ హస్పిటల్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 3వతేదిన కార్ఖాన పీఎస్ పరిధి ఏటీసీ గెట్ సమీపంలో విజయ్ కర్రీ పాయింట్ నిర్వాహకుడు బానోత్ విజయ్ తన హోండా యాక్టివాను రాత్రి పార్క్ చేశాడు. మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు చూడగా యాక్టీవా కనిపించలేదు చోరీ అయినట్లు గ్రహించి కార్ఖాన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా మంగళవారం ఎస్ఐ రవికుమార్ తన సిబ్బందితో డైమండ్‌పాయింట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా యాక్టివాపై వస్తున్న యువకుడు గమనించి ధృవపత్రాలు చూపించాలని అడగగా పారిపోయేందుకు ప్రయత్నించాడు. కొద్ది దూరం పోలీసులు వెంబడించి పట్టుకుని తమదైన శైలీలో విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి హోండాయాక్టీవా, బుల్లెట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## యువతిపై లైంగిక దాడి

**సనత్‌నగర్:** ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువతిపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్న రాజుకుమార్ (28)కు ఓ యువతి (26)తో ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైంది. పరిచయం స్నేహంగా మారింది. ఆ తరువాత ప్రేమిస్తున్నానంటూ నమ్మబలికాడు. ఈ ఏడాది జూన్ 24న బేగంపేటలోని ఓ హోటల్‌కు తీసుకువచ్చి బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు ఈ నెల 4న దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అక్కడి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి బేగంపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

### మరో ఘటనలో..

కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన యువతి (29)కి వరంగల్ జిల్లా గుల్లసింగారానికి చెందిన కుందుకూరి (28) పరిచయం అయ్యాడు. ప్రేమిస్తున్నానంటూ వెంటపడి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. బాధితురాలి నుంచి పలుమార్లు డబ్బులు తీసుకున్నాడు. మొత్తం కలిపి రూ.14,60,000 ఇచ్చింది. పెళ్లి చేసుకుంటానని చెప్పి 2022లో బేగంపేట ప్రకాష్‌నగర్ ప్రాంతంలో గల ఓ గదికి తీసుకువచ్చి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పెళ్లి చేసుకోవాలని బాధితురాలు నిలదీస్తే దాడి చేసి, కులం పేరిట దూషించాడు. దీంతో బాధితురాలు మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.